దశ

నిజం.. నిర్భయంగా..

WWW.DASHANEWS.COM

గురువారం 14 08 2025

సంపుటి 1 సంచిక 106

పేజీలు : 02

UDYAM / TS-09-0148996

చరిత్రలో ఈ రోజు

- **1895:** ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధుడు, తెలుగులో విజ్ఞాన సర్వస్వాన్ని ప్రచురించిన మాగంటి బాపినీడు జననం. (చిత్రంలో మాగంటి అన్నపూర్ణమ్మ, మాగంటి బాపినీడు)
- **1933:** తెలుగు సినిమా అగ్రనాయకుడు అక్కినేని నాగేశ్వరరావు సతీమణి అన్నపూర్ణ జననం (మ.2011).
- **1947:** భారత దేశ విభజన జరిగి పాకిస్తాన్ ఏర్పడింది.
- **1958:** ప్రముఖ భౌతిక శాస్త్రవేత్త, నోబెల్ బహుమతి గ్రహీత ఫ్రెడెరిక్ జోలియట్ క్యూరీ మరణం (జ.1900).
- **1966:** ఒక అమెరికన్ నటి, అందాల రాణి హాలీ బెర్రీ జననం.
- **1968:** భారత దేశ క్రికెట్ క్రీడాకారుడు ప్రవీణ్ ఆమ్రే జననం.
- **2011:** భారత ప్రముఖ సినీనటుడు, దర్శకుడు షమ్మీ కపూర్ మరణం (జ.1931



భూములకు భూధార్ నంబర్లు

కేటాయింపునకు ప్రణాళికలు రూపొందించాలని సీఎం రేవంత్ రెడ్డి ఆదేశం

వారసత్వ, మ్యుటేషన్లకు దరఖాస్తులను త్వరగా పరిష్కరించాలి

నెలాఖరులోగా ఇందిరమ్మ ఇండ్ల ప్రారంభోత్సవానికి ఏర్పాట్లు చేయాలని సూచన

దశ, హైదరాబాద్: రాష్ట్రవ్యాప్తంగా భూములకు భూధార్ నెంబర్ల కేటాయింపునకు అవసరమైన ప్రణాళికలు రూపొందించాలని సీఎం ఎ. రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. అలాగే, రెవెన్యూ సదస్సుల్లో వారసత్వ, ఇతర మ్యుటేషన్లకు సంబంధించి స్వీకరించిన దరఖాస్తులను త్వరగా పరిష్కరించాలని చెప్పారు. కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో రెవెన్యూ, గృహ నిర్మాణ శాఖలపై ముఖ్యమంత్రి గారు రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి తో పాటు ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించారు. లైసెన్స్ సర్వేయర్లు సర్వే చేసిన అనంతరం రెగ్యులర్ సర్వేయర్లు వాటిని స్క్రూటినీ చేసేలా చూడాలని ఆదేశించారు. కోర్ అర్బన్ ఏరియాలో నూతనంగా నిర్మించనున్న 10 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల నమూనాలను ఈ సందర్భంగా ముఖ్యమంత్రి పరిశీలించారు. ప్రతి కార్యాలయంలో పార్కింగ్, క్యాంటీన్, ఇతర మౌలిక వసతులు ఉండాలని, కార్యాయాలు పూర్తిగా ప్రజలకు స్నేహ పూర్వక వాతావరణంలో, సౌకర్యవంతంగా ఉండేలా చూడాలని సూచించారు. రాష్ట్ర వ్యాప్తంగా పలు జిల్లాల్లో పెద్ద సంఖ్యలో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం పూర్తయిందని అధికారులు వివరించగా, ఈ నెలాఖరులోగా ఇందిరమ్మ ఇండ్ల ప్రారంభోత్సవానికి ఏర్పాట్లు చేయాలని ముఖ్యమంత్రి అధికారులకు సూచించారు. హైదరాబాద్ నగరంలోని హౌసింగ్ బోర్డుతో జాయింట్ వెంచర్‌గా ఉన్న ప్రాజెక్టుల్లోని తలెత్తిన సమస్యలను పరిష్కరించాలని అధికారులకు సూచించారు.

రాష్ట్రం అంతటికీ రెడ్ అలర్ట్

తెలంగాణలో గురువారం భారీ వర్షాలు కురుస్తాయని హైదరాబాద్ వాతావరణ శాఖ హెచ్చరించింది. రాష్ట్రం అంతటికీ రెడ్ అలర్ట్ జారీ చేసింది. సంగారెడ్డి, మెదక్, వికారాబాద్, మేడ్చల్, యాదాద్రి భువనగిరి, ఖమ్మం, భద్రాద్రి, భూపాలపల్లి,ములుగు జిల్లాలకు రెడ్ కలర్ వార్నింగ్ జారీ చేశారు.

దశ, హైదరాబాద్

నేడు పాఠశాలలకు సెలవు

వాతావరణ శాఖ సూచన మేరకు భారీ వర్షాల నేపథ్యంలో ప్రభుత్వ ఆదేశాల ప్రకారం ఆగస్టు 14వ తేదీన జిల్లాలోని అన్ని యాజమాన్యాల పాఠశాలలకు సెలవు ప్రకటించడం జరిగిందని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ, ప్రైవేట్ అన్ని యాజమాన్యాల క్రింద నిర్వహించబడుతున్న పాఠశాలలకు సెలవు ఇవ్వడం జరిగిందని, నిబంధనలు ఉల్లంఘించిన విద్యా సంస్థలపై చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు

దశ, మంచిర్యాల

వ్యవసాయ వర్సిటీలో విద్యార్థి ఆత్మహత్య

రాజేంద్రనగర్ ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయంలో అగ్రి బీఎస్సీ మూడో సంవత్సరం చదువుతున్న విద్యార్థి రిత్విక్ రాజ్ ఆత్మహత్య చేసుకున్నారు. స్నేహ తప్పి పడివున్న రిత్విక్ ను తోటి విద్యార్థులు హుటాహుటిన లంగర్ హౌజ్ లోని మైత్రి ఆస్పత్రికి తరలించారు. అప్పటికే మృతిచెందినట్లు డాక్టర్లు నిర్ధారించారు.

దశ, రంగారెడ్డి

80 మార్కులకే టెన్త్ పరీక్షలు

దశ, హైదరాబాద్: రాష్ట్ర వ్యాప్తంగా ఈ ఏడాది పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో కీలక మార్పులు చేస్తున్నట్లు విద్యాశాఖ నిర్ణయం తీసుకున్న సంగతి తెలిసిందే. అయితే దీనిపై తాజాగా యూటర్న్ తీసుకుంది. ఈ ఏడాదికి పాత పద్ధతిలోనే పదో తరగతి పబ్లిక్ పరీక్షలు ఉంటాయని తెలంగాణ విద్యాశాఖ తాజాగా వెల్లడించింది. అయితే పదో తరగతి పరీక్షల్లో 20 శాతం ఇంటర్నల్ మార్కుల విధానం కొనసాగించాలని, 80 శాతం ఎక్స్‌టర్నల్ మార్కులకు కేటాయించనున్నట్లు తెలిపింది. ఈ మేరకు విద్యాశాఖ ఆదేశాలు జారీ చేసింది.

ప్రతి విద్యార్థి చదువుకునేందుకు ప్రభుత్వం ప్రోత్సాహం : మంత్రి వివేక్

దశ, మంచిర్యాల జిల్లా ప్రతినిధి: రాష్ట్రంలోని ప్రతి విద్యార్థి చదువుకునేందుకు ప్రభుత్వం అవకాశాలు కల్పించి, ప్రోత్సహిస్తుందని రాష్ట్ర కార్మిక, ఉపాధి, భూగర్భ గనులు శాఖ మంత్రి గడ్డం వివేకానంద తెలిపారు. బుధవారం జిల్లాలోని మందమర్రి మండల కేంద్రంలో కార్మల్ డిగ్రీ కళాశాల ప్రారంభోత్సవ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్, ఫాదర్ ఫిలిప్ లతో కలిసి హాజరై, కళాశాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా రాష్ట్ర మంత్రి మాట్లాడుతూ, రాష్ట్రంలో విద్యారంగాన్ని బలోపేతం చేస్తూ, అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సౌకర్యం కోసం సకల సదుపాయాలు కల్పించి నాణ్యమైన విద్యను అందించడం జరుగుతుందని, రాష్ట్రంలోని ప్రతి విద్యార్థి చదువుకునేందుకు ప్రభుత్వం అవకాశాలు కల్పించి ప్రోత్సహిస్తుందని తెలిపారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, మందమర్రి మండల కేంద్రంలో డిగ్రీ కళాశాలను ప్రారంభించడం సంతోషంగా ఉందని, ఈ ప్రాంత విద్యార్థులకు ఎంతో సౌకర్యంగా ఉంటుందని తెలిపారు. ప్రభుత్వం విద్యారంగాన్ని అభివృద్ధి చేయడంతో పాటు నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించే దిశగా చర్యలు తీసుకుంటుందని తెలిపారు. పరిశ్రమల నిర్వహణకు మానవ శక్తి అవసరమని, ఇందుకు గాను ప్రభుత్వం పారిశ్రామక శిక్షణ సంస్థ లను అభివృద్ధి చేస్తూ, జిల్లాలో 4 అడ్వాన్సుడ్ టెక్నాలజీ సెంటర్లను ఏర్పాటు చేసి శిక్షణ అందిస్తుందని తెలిపారు. టాటా సంస్థ సమన్వయంతో ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్, రోబోటిక్స్ ఇతర అధునాతన సాంకేతికత కలిగిన కోర్సులలో శిక్షణ అందించడం జరుగుతుందని తెలిపారు. జిల్లాలోని చెన్నూరు ప్రాంతంలో 1 కోటి 50 లక్షల రూపాయల వ్యయంతో ప్రభుత్వ డిగ్రీ కళాశాలను ఏర్పాటు చేసి విద్యార్థులకు విద్యను చేరువులో అందించడం జరుగుతుందని తెలిపారు. 2047 నాటికి తెలంగాణ రాష్ట్రాన్ని దేశంలో ప్రథమ స్థానంలో నిలిపేందుకు అందరం సమిష్టిగా కృషి చేయాలని తెలిపారు.

శంషాబాద్ విమానాశ్రయంలో పలు విమానాల దారి మళ్లింపు

దశ, హైదరాబాద్ : ;శంషాబాద్ విమానాశ్రయంలో పలు విమానాలను అధికారులు దారి మళ్లించారు. ప్రతికూల వాతావరణం నేపథ్యంలో ఆయా విమానాలను దారి మళ్లిస్తూ నిర్ణయం తీసుకున్నారు. మొత్తం ఎనిమిది విమానాలను దారి మళ్లించినట్లు తెలిపారు. హైదరాబాద్‌కు రావాల్సిన విమానాలను విజయవాడ, బెంగళూరు, తిరుపతికి మళ్లించినట్లు పేర్కొన్నారు. విజయవాడకు ఐదు, బెంగళూరుకు 3,తిరుపతికిఒకవిమానాన్ని మళ్లించినట్లు తెలిపారు. హైదరాబాద్ నుంచి బయలుదేరాల్సిన విమానాలను తాత్కాలికంగా రద్దు చేసినట్లు పేర్కొన్నారు. ఇదిలా ఉండగా.. హైదరాబాద్‌లోని పలు ప్రాంతాల్లో వర్షాలు కురుస్తున్నాయి. నగరాన్ని మేఘాలు కమ్మేశాయి. ఈ క్రమంలోనే విమానాల రాకపోకలకు అంతరాయం ఏర్పడినట్లు సమాచారం.

ఈడీ విచారణకు హాజరైన మంచు లక్ష్మి

దశ, హైదరాబాద్: బెట్టింగ్ యాప్ కేసు విచారణలో భాగంగా నటి మంచు లక్ష్మి హైదరాబాద్ బషీర్‌బాగ్‌లో ఉన్న ఈడీ కార్యాలయం ముందుకు హాజరైయారు. బెట్టింగ్ యాప్స్‌పై ప్రచారం కేసులో దాదాపు మూడు గంటల పాటు లక్ష్మిని ఈడీ విచారించింది. తాను ప్రమోట్ చేసిన యోలో అనే యాప్ లావాదేవిలతో పాటు ఇతర అంశాలపై లక్ష్మి స్టేట్‌మెంట్‌ను ఈడీ రికార్డ్ చేసింది. అలాగే యాప్ ప్రమోట్ చేసినందుకు తీసుకున్న పారితోషికంపై ఈడీ ఆరా తీసింది. అనంతరం తన బ్యాంక్ స్టేట్‌మెంట్లను లక్ష్మి ఈడీకి అందించింది. ఇక విచారణ అనంతరం లక్ష్మి ఈడీ కార్యాలయం నుంచి బయటికి వచ్చింది. నిషేధిత బెట్టింగ్ యాప్‌లను ప్రచారం చేసిన వ్యవహారంలో భాగంగా విచారణకు రావాలని మంచు లక్ష్మికి ఈడీ సమన్లు జారీ చేసిన సంగతి తెలిసిందే. ఇప్పటికే ఈ కేసులో విజయ్ దేవరకొండ, ప్రకాశ్‌రాజ్, రానా దగ్గుబాటిలను ఈడీ విచారించింది.

సుప్రీం సంచలన తీర్పు!

గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీగా ఎన్నికైన కోదండరాం, అలీఖాన్ నియామకం రద్దు

దశ, ఢిల్లీ : సుప్రీంకోర్టు సంచలన తీర్పు వెలువరించింది. గవర్నర్ కోటాలో ఎన్నికైన ఎమ్మెల్సీ కోదండరాం, అలీఖాన్ నియామకం రద్దు చేస్తూ.. సుప్రీం ధర్మాసనం ఉత్తర్వులు జారీ చేసింది. బీఆర్ఎస్ నేతలు దాసోజు శ్రవణ్, సత్యనారాయణ పిటిషన్‌లపై విచారణ చేపట్టిన న్యాయస్థానం కోదండరాం, అలీఖాన్ నియామకం రద్దు చేస్తూ ఆదేశాలు జారీ చేసింది. రెండు ఎమ్మెల్సీ స్థానాలలో తాజా నామినేషన్లు తమ తుది తీర్పుకి లోబడే ఉంటాయని సుప్రీంకోర్టు చెప్పుకొచ్చింది. కోదండరాం, అలీఖాన్‌లు తెలంగాణ గవర్నర్ కోటా ఎమ్మెల్సీలుగా నియామకం అయిన విషయం తెలిసిందే. అయితే వీరి నియామకం అక్రమంగా జరిగిందని.. దాసోజు శ్రవణ్, సత్యనారాయణలు గవర్నర్‌కు తెలిపారు. గవర్నర్ వీరి వాదనను తిరస్కరించడంతో.. సుప్రీంకోర్టును ఆశ్రయించారు. వారి నియామకాలపై విచారణ జరిపి నియామకాన్ని రద్దు చేయాలని బీఆర్ఎస్ నేతలు సుప్రీంను కోరారు. ఈ మేరకు ఇవాళ (బుధవారం) విచారణ జరిపిన అత్యున్నత న్యాయస్థానం.. ఆగస్టు 14, 2024 తీర్పులో మార్పులు చేస్తూ.. వారి నియామకం చెల్లదని తీర్పును వెలువరించింది. తదుపరి విచారణను సెప్టెంబర్ 17వ తేదీకి వాయిదా వేసింది.

40 లక్షల ఇళ్లపై జాతీయ జెండా

దశ, నాచారం :79వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా నాచారం డిల్లి పబ్లిక్ స్కూల్ పాఠశాలలో హర్ ఘర్ తిరంగా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్ రావు, డిపిఎస్ చైర్మన్ ఎమ్మెల్సీ మల్కా కొమురయ్య, బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్, బీజేపీ రాష్ట్ర మహిళా నాయకురాలు రాణి రుద్రమ హాజరై కార్యక్రమాన్ని ప్రారంభించారు.ఈ సందర్భంగా రామ్ చందర్ రావు మాట్లాడుతూ పార్టీలకు అతీతంగా హర్ గర్ తిరంగా ర్యాలీ నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఇందులో భాగంగా 40 లక్షల ఇళ్లపై జాతీయ జెండా ఎగురవేస్తామన్నారు. ప్రతి ఒక్కరు స్వచ్ఛందంగా తమ ఇంటిపై జాతీయ జెండా ఎగురవేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలోడిల్లీ బీజేపీ పార్టీ శ్రేణులు మల్లేల నర్సింగ్ రావు,పోతగాని గోపాల్ గౌడ్,రవి నాయక్,రవీందర్ తదితరులు పాల్గొన్నారు

జనహితను విజయవంతం చేయాలి

అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు ప్రజల్లోకి విస్తృతంగా తీస్కెళ్లాలి

ఆగస్టు 14న రాత్రి 8 గంటలకు మాస్ క్యాండిల్ ర్యాలీలు నిర్వహించాలి: టీపీసీసీ ఛీఫ్ మహేష్ గౌడ్

దశ, హైదరాబాద్: జనహిత పాదయాత్ర ను విజయవంతం చేయాలని , గ్రామ స్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు పార్టీ కమిటీలు వెంటనే వేయాలని , కాంగ్రెస్ పార్టీ ఆస్తుల వివరాలు వెంటనే పంపాలని వరదలల్లో ప్రజలకు అండగా ఉండాలని టీపీసీసీ అధ్యక్షులు మహేష్‌కుమార్ గౌడ్ అన్నారు. బుధవారం జూమ్ సమావేశం నిర్బహించారు. ఈ సమావేశంలో ఏఐసీసీ ఇంచార్జ్ మీనాక్షి నటరాజన్.. జిల్లా ఇంచార్జ్ లు మంత్రి పొన్నం ప్రభాకర్, అడ్లూరి లక్ష్మణ్ కుమార్ లతోపాటు డీసీసీ లు.. జిల్లా ఇంచార్జ్ లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మహేష్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ మండల కమిటీలను నెలాఖరు లోగా వేయాలి.. గ్రామ కమిటీలను సెప్టెంబర్ 15 వరకు పూర్తి చేసి పంపాలి. 24 నుంచి రెండో విడత జనహిత పాదయాత్ర ప్రారంభం అవుతుంది. పాదయాత్ర లో పెద్దఎత్తున ప్రజలు పాల్గొనేలా ప్రణాళికలు చేయాలి.

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు ప్రజల్లోకి విస్తృతంగా తీస్కెళ్లాలి.రాహుల్ గాంధీ చేపట్టిన బీజేపీ ఈసీ అక్రమాలపై ఓట్ చోరీ అంశాన్ని ప్రజల్లో బాగా ప్రచారం చేపట్టాలి. రాష్ట్రంలో తీవ్రమైన వర్షాలు వరద పరిస్థితులు ఉన్న నేపథ్యంలో ప్రజలకు కాంగ్రెస్ క్యాడర్ అందుబాటులో ఉండి వారికి సహాయ సహకారాలు అందించి.. భరోసా కల్పించాలని అన్నారు.

దశ
నిజం.. నిర్భయంగా..

రాజధాని బ్యాంకు ప్రారంభించిన ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి

దశ, ఎల్బీనగర్ : హయత్ నగర్ - కుంట్లూరు రోడ్డులోని ప్రియదర్శిని కాలనీలో బుధవారం రాజధాని బ్యాంక్ 10వ బ్రాంచ్ కార్యాలయాన్ని ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. హయత్ నగర్, కుంట్లూరు పరిసర ప్రాంతాల ప్రజల ఆర్థిక లావాదేవీలకు ప్రియదర్శిని కాలనీలోని రాజధాని బ్యాంక్ ఎంతో ఉపయోగపడుతుందన్నారు. రాజధాని బ్యాంక్ చైర్మన్ వేమిరెడ్డి నర్సింహరెడ్డి మాట్లాడుతూ... ఇప్పటివరకు తొమ్మిది బ్రాంచ్ లు కస్టమర్ల మన్ననలు అందుకుంటూ విజయవంతంగా కొనసాగుతున్నాయన్నారు. రాజధాని బ్యాంకులో ప్రజల ఆర్థిక అవసరాలు తీర్చేవిధంగా సేవలందిస్తామని తెలిపారు. కార్యక్రమంలో సీనియర్ మేనేజర్ రవికాంత్ రెడ్డి, చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ఆదినారాయణ రెడ్డి, రామ్ రెడ్డి, ఘన్ శ్యామ్ భాటి, నిర్మలాదేవి, శ్రీరాములు, విజయ గోపాల్ రెడ్డి, జైపాల్ రెడ్డి, క్రాంతి రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మాదకద్రవ్యాల నిరోధానికి విస్తృత స్థాయిలో అవగాహన

- నాతోపాటు ఏ ఒక్కరూ డ్రగ్స్ బారిన పడకుండా కృషి చేస్తామని సామూహిక ప్రతిజ్ఞ
- నషా ముక్త్ భారత్ అభియాన్ సందర్భంగా అదనపు కలెక్టర్ చంద్రారెడ్డి

దశ, రంగారెడ్డి : మత్తు పదార్థాలు, మాదకద్రవ్యాల నిరోధానికి విస్తృత స్థాయిలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని జిల్లా అదనపు కలెక్టర్ చంద్రా రెడ్డి సంబంధిత అధికారులకు సూచించారు. బుధవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ భవనంలోని సమావేశ మందిరంలో జిల్లా అదనపు కలెక్టర్చంద్రా రెడ్డి అధ్యక్షతన మత్తు పదార్థాల నిరోధక కమిటీ జిల్లా స్థాయి సమావేశం నిర్వహించడం జరిగింది. బుధవారం మిషన్ పరివర్తన సామూహిక ప్రతిజ్ఞ కార్యకలాపం 13.8.2025 నషా ముక్త్ భారత్ అభియాన్ సందర్భంగా అదనపు కలెక్టర్ చంద్రారెడ్డి "మాదకద్రవ్యాల అక్రమ రవాణా మరియు దుర్వినియోగం పై జరుగుతున్న పోరాటంలో క్రియాశీల భాగస్వామిని అవుతానని డ్రగ్స్ వాడకం వలన కలిగే దుష్పరిణామాల గురించి సంపూర్ణ అవగాహన కలిగి ఉండి, నాతోపాటు ఏ ఒక్కరూ డ్రగ్స్ బారిన పడకుండా కృషి చేస్తానని, డ్రగ్స్ అమ్మకం, కొనుగోలు చేసే వ్యక్తుల సమాచారాన్ని పోలీసులకు తెలియచేస్తానని, డ్రగ్ రహిత జీవనశైలిని అనుసరిస్తానని, డ్రగ్‌రహిత సమాజమే లక్ష్యంగా సాగుతున్న తెలంగాణ ప్రభుత్వ సంకల్పంలో భాగస్వామినవుతానని" ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ మత్తు పదార్థాల నియంత్రణకు చేపట్టిన చర్యలపై చర్చించి, ఇకముందు చేపట్టవలసిన చర్యలపై అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఈ సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి సంగీత, జిల్లా ప్రజా పరిషత్ సీఈఓ కృష్ణారెడ్డి, డీపీఓ సురేష్ మోహన్, జిల్లా సంక్షేమ శాఖ అధికారి శ్రీలత, సంబంధిత అధికారులు సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

కార్పోరేట్ వ్యవస్థలు భారత వ్యవసాయ రంగాన్ని విడిచి పెట్టాలి

- భారత్ పై అమెరికా విధించిన సుంకాలను రద్దు చేయాలి: ఎస్ కే యం

దశ సూర్యాపేట ప్రతినిధి : కార్పోరేట్ శక్తులు భారత వ్యవసాయ రంగాన్ని విడిచి పెట్టాలని ఎస్ కే యం జిల్లా కన్వీనర్ మందారి డేవిడ్ కుమార్, ఏఐకేఎఫ్ రాష్ట్ర నాయకులు వరికుప్పల వెంకన్న, సిపిఐ పట్టణ కార్యదర్శి బూర వెంకటేశ్వర్లు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు ములకలపల్లి రాములు లు అన్నారు. బుధవారం ఎస్ కే యం జాతీయ కమిటీ పిలుపులో భాగంగా సూర్యాపేట జిల్లా కేంద్రంలోని కొత్త బస్టాండ్ వద్ద ఆగస్టు 13 క్విట్ ఇండియా డే సందర్భంగా అమెరికా అధ్యక్షుడు రోనాల్డ్ ట్రంప్, దేశ ప్రధాని నరేంద్ర మోడీ దిష్టిబొమ్మలను దగ్ధం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం మరో సామ్రాజ్యవాద పాలనకు దేశంలో అవకాశం కల్పిస్తుందని, అందువల్ల కేంద్ర ప్రభుత్వం వెంటనే అమెరికా, ఇంగ్లాండ్ ఒప్పంధం నుండి తప్పుకోవాలని డిమాండ్ చేశారు. మోడీ నిర్ణయాలను కర్ణాటక, తెలంగాణలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వాలు అమలు చేయకపోవడం సిగ్గుచేటు అన్నారు. ట్రంప్ ముందు మోడీ బానిసగా మారారని, దేశ ప్రజలను కూడా బానిసలుగా మార్చే కుట్ర జరుగుతుందన్నారు. తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మట్టిపల్లి సైదులు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో తెలంగాణ రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి బెల్లంకొండ సత్యనారాయణ, దంతాల రాంబాబు, కునుకుంట్ల సైదులు, నారబోయిన వెంకట్ యాదవ్, వల్లపుదాసు సాయికుమార్, పోలే బోయిన కిరణ్ , జే నరసింహారావు, ఎల్గూరి గోవింద్, పిండిగ నాగమణి, ఉప్పుల రమేష్, పుల్లూరి సింహాద్రి, నల్లగొండ నాగయ్య, నర్సిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

యువత మత్తు పదార్థాలకు బానిసలు కాకుండా చూడాలి

- ఏరియా జిఎం జి దేవేందర్

దశ, మంచిర్యాల / మందమర్రి : యువత మత్తు పదార్థాలకు బానిసలు కాకుండా చూడాలని ఏరియా జిఎం జి దేవేందర్ తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆదేశాల మేరకు మాదకద్రవ్య విముక్త భారత్ పేరుతో దేశవ్యాప్తంగా నిర్వహిస్తున్న చైతన్య కార్యక్రమాలలో భాగంగా ఏరియా జనరల్ మేనేజర్ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన సమావేశంలో ఏరియా జనరల్ మేనేజర్ జి దేవేందర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో ఏరియా ఎస్ఓటు జిఎం విజయ్ ప్రసాద్, ఏరియా పర్సనల్ మేనేజర్ ఎస్ శ్యాంసుందర్, సీనియర్ పర్సనల్ ఆఫీసర్ శంకర్, వివిధ విభాగాల అధికారుల, ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో సింగరేణి ఉద్యోగి మృతి

దశ, మంచిర్యాల / మందమర్రి : మండలంలోని బొక్కలగుట్ట వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో సింగరేణి ఆర్కే 7 గనిలో విధులు నిర్వహిస్తున్న పట్టణానికి చెందిన సాయి వెంకటేష్ (27) మృతి చెందాడు. పట్టణ ఎస్ఐ ఎస్ రాజశేఖర్ తెలిపిన వివరాల ప్రకారం, ఆగస్టు 12న సాయి వెంకటేష్ తన ద్విచక్ర వాహనం టీజీ 19 0214 పై పని నిమిత్తం మంచిర్యాలకు వెళ్లి తిరిగి వస్తుండగా బొక్కల గుట్ట వద్ద నేషనల్ హైవే రోడ్డు దగ్గర గల గాంధారి మైసమ్మ దేవాలయం వద్ద టిజి 18టి 1989 నెంబర్ లారీని దాని డ్రైవర్ అజాగ్రత్తగా ఎలాంటి ఇండికేటర్స్ లైట్స్ వేయకుండా రోడ్డుమీద ఆపడంతో వెంకటేష్ తన ద్విచక్ర వాహనంతో లారీని ఢీకొట్టి, తీవ్ర గాయాలు పాలయ్యాడు. ప్రమాదంలో గాయపడిన వెంకటేష్ ను మంచిర్యాలలోని ప్రభుత్వాసుపత్రి చేర్చగా, చికిత్స పొందుతూ వెంకటేష్ మృతి చెందాడు. ఈ మేరకు మృతిని బావ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

నాళా సమస్యల పరిష్కారానికి కృషి

- గ్యారల శ్రీనివాస్ గౌడ్

దశ, పెద్ద అంబర్ పేట : పెద్ద అంబర్పేట్ మున్సిపాలిటీ పరిధిలోని 1వ వార్డు భూదాన్ కాలనీలో వర్షం పడినప్పుడల్లా డ్రైనేజీ నీరు పొంగిపొర్లి స్థానికులకు తీవ్ర ఇబ్బందులు కలుగుతున్నాయి. ఈ సమస్యతో విసిగిపోయిన కాలనీ వాసులు తాజా మాజీ కౌన్సిలర్ గ్యారల శ్రీనివాస్ గౌడ్ను కలసి బుధవారం తమ ఆవేదన వ్యక్తం చేశారు. స్థానికుల విన్నపంపై స్పందించిన శ్రీనివాస్ గౌడ్, వారితో కలిసి భూదాన్ కాలనీని సందర్శించి పరిస్థితిని ప్రత్యక్షంగా పరిశీలించారు. అనంతరం సంబంధిత అధికారులతో పాటు స్థానిక ఎమ్మెల్యేను సంప్రదించి, నాళా సమస్యకు త్వరితగతిన పరిష్కారం చూపేలా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కాలనీ వాసులు ఈ సందర్భంగా, ప్రజా సమస్యల పట్ల ఎప్పుడూ స్పందిస్తూ సహాయం అందిస్తున్న శ్రీనివాస్ గౌడ్కు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో భూదాన్ కాలనీ మాజీ ప్రెసిడెంట్ షేక్ లాల్ మొహమ్మద్, జాయింట్ సెక్రెటరీ నిరంజన్ వలి, కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

ఆలోచనల పట్ల విద్యార్థులు స్వీయ నియంత్రణ కలిగి ఉండాలి

- మాదకద్రవ్యాల నిర్మూలనలో విద్యార్థులు భాగం కావాలి:ఎస్పి కె.నరసింహ

దశ సూర్యాపేట ప్రతినిధి : నషా ముక్త్ భారత్ అభియాన్, మాదకద్రవ్యాల రహిత భారతదేశ నిర్మాణం కార్యక్రమంలో భాగంగా ఈరోజు సూర్యాపేట పట్టణంలో గల జయ పాఠశాల నందు విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమనికి జిల్లా ఎస్పీ నరసింహ ఐపిఎస్ ముఖ్య అతిధిగా హాజరై డ్రగ్స్ నిర్మూలనలో భాగస్వామ్యం అవుతామని, దృఢమైన సమాజ నిర్మాణంలో భాగస్వామ్యం అవుతామని, చెడు అలవాట్లకు దూరంగా ఉంటామని విద్యార్థులచే ప్రతిజ్ఞ చేయించారు. మన ఆలోచనలను, అలవాట్లను నియంత్రనలో ఉంచుకోవాలని, విద్యార్థులు స్వీయ నియంత్రణ కలిగి ఉండాలని అన్నారు. విద్యాబుద్ధులు నేర్పి ఉన్నతమైన పౌరులుగా తీర్చిదిద్దే బాధ్యత గురువులది అయితే, సమాజంలో నేర ప్రవృత్తి కలిగిన వారిని సత్ప్రవర్తన కలిగిన పౌరులుగా మార్చడం పోలీసుల విధి అన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఎస్సైలు ఏడుకొండలు, శివతేజ పాఠశాల యజమాన్యం, ప్రిన్సిపాల్ ఉపేందర్, ఉపాధ్యాయులు, విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.

భవనం పై నుంచి దూకి హోటల్ రిసెప్షనిస్ట్ ఆత్మహత్య

దశ, నాచారం : ఓ వ్యక్తి భవనం పైనుంచి దూకి ఆత్మహత్య చేసుకున్న సంఘటన నాచారం పోలీస్ స్టేషన్ పరిధిలో బుధవారం చోటుచేసుకుంది. సీఐ రుద్వీర్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం ఆంధ్రప్రదేశ్ ఈస్ట్ గోదావరి జిల్లా కు చెందిన పవన్ రాజ్ (31) హబ్సిగూడ లో ద్వారక హోటల్ లో గత కొంతకాలంగా రిసెప్షనిస్ట్ గా పని చేస్తున్నాడు.మధ్యన సమయంలో హోటల్ లో ఎవ్వరు లేని సమయంలో ఐదు అంతస్తుల భవనం పైనుంచి దూకి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పై నుంచి పడ్డ శబ్దానికి స్థానికులు చూసి భయాందోళనకు గురయ్యారు.దీంతో వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని ఆత్మహత్యకు గల కారణాలపై ఆరా తీశారు. అనంతరం మృతదేహాన్ని శవ పరీక్ష నిమిత్తం గాంధీ ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు

భారత సైన్యంలో యాదవ (అహీర్) రెజిమెంట్ ను ఏర్పాటు చేయాలి

దశ సూర్యాపేట ప్రతినిధి : భారత సైన్యంలో దేశ రక్షణ దృష్ట్యా యాదవ (అహీర్) రెజిమెంట్ ను ఏర్పాటు చేయాలని మాజీ రాజ్యసభ సభ్యులు బదుగుల లింగయ్య యాదవ్, శ్రీకృష్ణ ట్రస్ట్ చైర్మన్ డాక్టర్ ఊర రామ్మూర్తి యాదవ్ లు అన్నారు. భారత సైన్యంలో యాదవ రెజిమెంట్ ని ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ బుధవారం అఖిల భారత యాదవ మహాసభ ఆధ్వర్యంలో పట్టణంలోని పలు వీధుల గుండా బైక్ ర్యాలీ నిర్వహించారు. అనంతరం పట్టణంలోని ఎంజీ రోడ్ లోని మహాత్మా జ్యోతి రావు పూలే విగ్రహానికి పూలమాలవేసి మాట్లాడారు. కార్యక్రమంలో అఖిల భారత యాదవ మహాసభ రాష్ట్ర కార్యదర్శి లోడంగి గోవర్ధన్, జిల్లా అధ్యక్షులు మర్యాద సైదులు యాదవ్, పిసిసి ఓబీసీ విభాగం రాష్ట్ర వైస్ చైర్మన్ తండు శ్రీనివాస్ యాదవ్, దురాజ్ పల్లి పెద్దగట్టు చైర్మన్ పోలేబోయిన నరసయ్య యాదవ్,మాజీ చైర్మన్ లు కోడి సైదులు యాదవ్, మద్ది శ్రీనివాస్ యాదవ్, తెలుగు దేశం రాష్ట్ర పరిశీలకులు బయ్య నారాయణ యాదవ్, సీనియర్ జర్నలిస్ట్ వజ్జె వీరయ్య యాదవ్, మట్టిపల్లి సైదులు యాదవ్, తగుళ్ల జనార్ధన్ యాదవ్, కోడి శివ, అన్నమయ్య రాము, కుర్ర నర్సయ్య, బయ్య దయాకర్, మాజీ సైనికులు జక్కుల శ్రీనివాస్, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఇంటిపై జాతీయ జెండా ఎగరాలి

- వాసవి యూత్ క్లబ్ అధ్యక్షుడు వెంపటి రవితేజ

దశ సూర్యాపేట ప్రతినిధి : ప్రతి ఇంటిపై భారతీయ జాతీయ జెండా ఎగరాలని వాసవి యూత్ క్లబ్ అధ్యక్షులు వెంపటి రవితేజ అన్నారు. బుధవారం సూర్యాపేట జిల్లా కేంద్రం లో కొత్త బస్టాండు వద్ద నుండి తిరంగా జండా ర్యాలీ నీ ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూచారిత్రాత్మకజెండాతోదేశప్రజలసంబంధందూరంగా ఉండకుండా హృదయపూర్వక సంబంధం గా మార్చే ప్రయత్నంలో భాగమని అన్నారు. త్రివర్ణ పతాకం తమ ఇళ్ల పై ఎగురవేయటం ద్వారా ప్రతిఒక్కరిలో జాతీయభావం పెం పొం దు తుం ద న్నా రు . ప్రతి పౌరుడు లోతైన దేశభక్తిని రగిలించడానికి జాతీయ జెండా ప్రాముఖ్యతపై అవగాహన పెంపొం దించడానికి కృషి చేస్తుందని అన్నారు. అనంతరం కొత్త బస్టాండ్ , శంకర్ విలాస్ సెంటర్,కల్నల్ సంతోష్‌బాబు విగ్రహం వరకు 104 అడుగుల భారీ జాతీయ జెండా తో జయ స్కూల్ విద్యార్థిని, విద్యార్థులు ర్యాలీగా వెళ్లారు. ఈ ర్యాలీలో వి 104 ఏ వాసవి క్లబ్ ఇంటర్నేషనల్, వి 104 ఏ వాసవి యూత్ క్లబ్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

కబ్జాకు గురవుతున్న చెరువులను రక్షించండి

- సీపీఎం పార్టీ మండల కార్యదర్శి ఏర్పుల నర్సింహా

దశ, అబ్దుల్లాపూర్మెట్ : కబ్జాలకు గురవుతున్న చెరువులను రక్షించాలని సీపీఎం పార్టీ మండల కార్యదర్శి ఏర్పుల నర్సింహా అన్నారు. సీపీఎం పార్టీ మండల కమిటీ ఆధ్వర్యంలో బుధవారం కబ్జాలకు గురవుతున్న చెరువులను రక్షించాలని అబ్దుల్లాపూర్మెట్ తహసీల్దార్కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఏర్పుల నర్సింహా మాట్లాడుతూ.. ఇనాంగూడ గ్రామ రెవెన్యూ పరిధిలో విజయవాడ జాతీయ రహదారికి అనుకుని భైరాన్ఖాన్ చెరువు ఉంటుందన్నారు. ఈ చెరువులో నీళ్లు ఎప్పుడూ నిండుకుండాలాగా తునిఖీలాడుతూ ఉంటాయి. అలాంటి భైరాన్ఖాన్ చెరువు ఎఫ్టీఎల్, బఫర్ జోన్లలో రియల్ ఎస్టేట్ వ్యాపారస్తులు, కొంతమంది రాజకీయ నాయకులు కబ్జాలు చేసి అక్కడ ఇండ్లు, ఫాంహౌస్లు నిర్మిస్తున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులువరకాల ముత్యాలు, గుండె శివకుమార్, చిర శివ, సూర్య తదితరులు పాల్గొన్నారు.

క్రీడా దుస్తులు అందజేయడం అభినందనీయం

దశ సూర్యాపేట ప్రతినిధి : ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు క్రీడా దుస్తులు అందజేయడం అభినందనీయమని అక్షర ఫౌండేషన్ ప్రధాన కార్యదర్శి కాళిదాసు అన్నారు. బుధవారం సూర్యాపేటకు చెందిన వంగేటి చెన్నారెడ్డి జ్ఞాపకార్థం వారి మనవడు వంగేటి కేశవరెడ్డి సహకారంతో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు పది వేల రూపాయల విలువగల క్రీడా దుస్తులు అక్షర ఫౌండేషన్ ప్రధాన కార్యదర్శి రుద్రంగి కాళిదాసు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి విద్యార్థికి ఆరోగ్యమే మహాభాగ్యం అని అది క్రీడల వల్లనే సాధ్యమవుతుందని తెలిపారు. ప్రధానోపాధ్యాయులు మురళీకృష్ణ మాట్లాడుతూ విద్య, వైద్య, క్రీడా, సాంస్కృతిక, సామాజిక రంగాలలో విశేష సేవలందిస్తున్న అక్షర ఫౌండేషన్ ను ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు అభినందించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు వాడపల్లి మురళీకృష్ణ , దాత వంగేటి కేశవరెడ్డి, కందాల వెంకటరెడ్డి, ఒంగేటి రామచంద్రారెడ్డి, భూతం లింగయ్య, శిగ శ్రీనివాస్, బొల్లం కృష్ణయ్య,వనమాల శ్రీనివాస్, కిషన్ సింగ్, ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు

ఘనంగా తిరంగా బైక్ ర్యాలీ

దశ, ఎల్బీనగర్ : స్వాతంత్ర దినోత్సవ వేడుకల్లో భాగంగా బీజేపీ రాష్ట్ర నాయకత్వం పిలుపు మేరకు రంగారెడ్డి (అర్బన్) జిల్లా భారతీయ జనతా యువ మోర్చా ఆధ్వర్యంలో బుధవారం ఉదయం హర్ ఘర్ తిరంగా ర్యాలీ నిర్వహించారు. నాగోల్ లోని భారత్ పెట్రోల్ బంక్ నుంచి వనస్థలిపురం కాంప్లెక్స్ వరకు తిరంగా ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్లు , నాయకులు మాట్లాడుతూ.. స్వాతంత్ర్యం మనకు అమూల్యమైన వరం. మనం స్వేచ్ఛగా జీవించేందుకు పోరాడిన మహానుభావుల త్యాగాలను స్మరించుకోవడం ప్రతి భారతీయుడి కర్తవ్యం అని పేర్కొన్నారు. ర్యాలీలో కార్పొరేటర్ బద్దం ప్రేమ్ మహేశ్వర్ రెడ్డి, చింతల అరుణా సురేందర్ యాదవ్, బీజేపీ రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్ రెడ్డి, మాజీ అధ్యక్షుడు సామ రంగారెడ్డి, బీజేపీ సీనియర్ నాయకులు, బీజేవైఎం నాయకులు పాల్గొన్నారు.

మోత్కూర్లో హర్ ఘర్ తిరంగా యాత్ర

దశ, మోత్కూర్ : స్వాతంత్ర్యం వచ్చి 79 ఏళ్లు పూర్తి చేసుకున్న వేళ మోత్కూర్ మండలంలో దేశభక్తి ఉత్సాహం వెల్లివిరిసింది. మోత్కూర్ మండల హర్ ఘర్ తిరంగా యాత్ర ఇన్చార్జి జమ్ము రమేష్ ఆధ్వర్యంలో పాలడుగు నుండి పాటిమట్ల స్టేజీ వరకు హర్ ఘర్ తిరంగా యాత్రను జెండాలతో, దేశభక్తి నినాదాలతో నిర్వహించారు. ప్రతి ఇంటి పై జాతీయ జెండాను ఎగురవేసి దేశ ఐక్యతను చాటాలని నిర్వాహకులు పిలుపునిచ్చారు. ఈ ర్యాలీలో మండల పార్టీ అధ్యక్షుడు గుదే మధుసూదన్ యాదవ్, గుంటి సతీష్, వేముల దశరథ, అల్లా శివప్రసాద్, కొంపెల్లి గణేష్, పనకబండ సతీష్, గణేష్, శ్యామల నరేష్, పరిగెల రామ నరసయ్య తదితరులు పాల్గొన్నారు